## క్లుప్తంగా

### సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



వంతాడ వైద్య శిబిరంలో రోగులకు పరీక్షలు చేస్తున్న డాక్టర్

**ప్రత్తిపాడు రూరల్:** ప్రజలు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని పెద్దిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ యశస్వి సూచించారు. మండలంలోని వంతాడ గిరిజన గ్రామంలో సోమవారం పెద్దిపాలెం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్లు 29 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. అనంతరం గ్రామంలోని జీపీఎస్ స్కూల్, అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ యశస్వి మాట్లాడుతూ గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ఫీవర్ సర్వే చేస్తున్నామన్నారు. ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ నాగవాసు, ఎంపీహెచ్ఎస్‌లు రాంబాబు, అప్పయ్యమ్మ, ఎంఎల్‌హెచ్‌ఎఫ్ జోషి, ఎంపీహెచ్ఏ డేవిడ్ రాజు, సూర్యకళ తదితరులు పాల్గొన్నారు.

### ఆకట్టుకున్న యమలీల వీధి నాటకం



యమలీల వీధి నాటకంలోని ఓ సన్నివేశం

**ప్రత్తిపాడు రూరల్:** మండలంలోని ధర్మవరంలో శ్రీగౌరీ శంకరుల ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక కళాకారులు ప్రదర్శించిన యమలీల వీధి నాటకం స్థానికులను విశేషంగా ఆకట్టుకుంది. గ్రామంలోని నంది సెంటర్, సీతంపేట, రామారావుపేట, మంగయ్యమ్మపేట, సినిమా హాలు సెంటర్లలో నాటకాన్ని ప్రదర్శించగా స్థానికులు ఆసక్తిగా తిలకించారు. నాటకంలో యమధర్మరాజుగా నానిపిల్లి అప్పలస్వామి, చిత్రగుప్తుడిగా నానిపిల్లి దినేష్ కుమార్, ప్రెసిడెంట్‌గా అమరపల్లి స్వర్ణ కుమార్, భటులుగా పంపనబోయిన దుర్గాప్రసాద్, ఆహారపు మహి నటించి మెప్పించారు. సీనియర్ కళాకారులు రాయి సుబ్బారావు, దాడి శ్రీను మేకప్–డ్రెసింగ్ చేశారు. తొలుత గౌరమ్మకు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

### బాధితుడికి ఆర్థిక సాయం

**ప్రత్తిపాడు రూరల్:** రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని వైఎస్సార్ సీపీ నేత ముదునూరి మురళీకృష్ణంరాజు సోమవారం పరామర్శించారు. ధర్మవరం గ్రామానికి చెందిన పులగపూరి బుల్లబ్బాయి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న మురళీరాజు ధర్మవరంలో బాధితుడి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ప్రమాదానికి కారణాలు తెలుసుకుని రూ.ఐదు వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో కోలా తాతబ్బాయి, జువ్వల ముసలయ్య, ముడదా యేసు, యాళ్ల యేసు, జువ్వల దొరబాబు, బోల్లు నాగేశ్వరరావు, మగాపు శివ తదితరులు పాల్గొన్నారు.

### సమస్యలు పరిష్కరించాలంటూ ధర్నా

**ఏలేశ్వరం:** తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పట్టణంలో సోమవారం ఎల్ఐసీ ఏజెంట్లు మహాధర్నా నిర్వహించారు. లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా పిలుపు మేరకు స్థానిక ఎల్ఐసీ శాటిలైట్ కార్యాలయం వద్ద ధర్నా చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూ.లక్ష బీమా పాలసీని పునరుద్ధరించాలని, పాలసీదారుల బోనస్ పెంచాలని, వయో పరిమితి తగ్గించాలని, ఏజెంట్ల కమీషన్ పూర్వ పద్ధతిలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎల్ఐసీ ఏజెంట్ల యూనియన్ అధ్యక్షుడు కోరుకొండ సూకరాజు, ఎగ్జిక్యూటివ్ మెంబర్ గోళ్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

### సారా స్థావరాలపై దాడులు

**ప్రత్తిపాడు:** మండలంలోని పెద్దిపాలెంలో సారా స్థావరాలపై సోమవారం విస్తృతంగా దాడులు నిర్వహించినట్టు స్థానిక ఎక్సైజ్ సీఐ పి.శివప్రసాద్ తెలిపారు. జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ కృష్ణకుమారి ఆదేశాల మేరకు పెద్దిపాలెం శివారు ప్రాంతాల్లో సారా స్థావరాలపై దాడులు చేశామన్నారు. ఈ దాడుల్లో 400 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశామని వివరించారు. ఎక్సైజ్ ఎస్సై పి.వంశీరామ్, సిబ్బంది పాల్గొన్నారు.

### చిత్రలేఖనం పోటీలు

**తుని:** విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించినట్టు రోటరీక్లబ్ ప్రోగ్రాం కమిటీ చైర్మన్ టి.నాగిరెడ్డి తెలిపారు. రంగం కార్యక్రమంలో భాగంగా స్థానిక రెడ్‌కాన్వెంట్ వీధిలోని రోటరీ క్లబ్ భవనంలో సోమవారం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. సీనియర్, జూనియర్ విభాగాల్లో నిర్వహించిన పోటీలకు తుని పరిసర ప్రాంతాల నుంచి 300 మంది విద్యార్థులు హాజరయ్యారు.

# పెంట కాలువలు

- అధ్వానంగా ప్రధాన పంట కాలువలు
- దిగువ ఆయకట్టుకు అందని నీరు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతులు



చెత్త, వ్యర్థాలతో నిండిన పంట కాలువ

**ఏలేశ్వరం:** నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో పంట కాలువలు అధ్వానంగా మారాయి. కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోయాయి. తుప్పలు, గుర్రపుడెక్కతో కాలువలు నిండిపోవడంతో దిగువ పొలాలకు నీరు పారడం లేదు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏలేశ్వరం పట్టణం, మండల పరిధిలో వేలాది ఎకరాలకు సాగునీరు అందించే తిమ్మరాజు చెరువు ప్రధాన పంటకాలువలు అధ్వానంగా మారడంతో దిగువ ఆయకట్టుకు నీరందక రైతులు నష్టపోతున్నారు. తిమ్మరాజు చెరువు నుంచి సుమారు 6 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నారు. మండలంలోని ఏలేశ్వరం, లింగంపర్తి, సిరిపురం, భద్రవరం, ప్రత్తిపాడు మండలం ఏలూరు తదితర గ్రామాలకు ఈ చెరువు నుంచి రెండు ప్రధాన కాలువల ద్వారా సాగునీరు పొలాలకు వెళుతోంది. పంట కాలువలు అధ్వానంగా మారడంతో పొలాలకు నీరు పూర్తిస్థాయిలో అందడం లేదు.

**గత ప్రభుత్వంలో నిధుల కేటాయింపు**

పంట కాలువల ఆధునీకరణకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ.16 లక్షలు కేటాయించింది. ఈ నిధులతో కాలువల అభివృద్ధి పనులు ప్రారంభిస్తుండగా ఎన్నికలు రావడంతో పనులు నిలిచిపోయాయి. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆ నిధులతో తూతూమంత్రంగా పనులు నిర్వహించి చేతులు దులుపుకొందని రైతులు ఆరోపిస్తున్నారు.

**ఆక్రమణల చెరలో...**

దిగువ ఆయకట్టుకు సాగునీరు అందించే కాలువలు ఆక్రమణలకు గురికావడంతో పంటలు నష్టపోతున్నామని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రధాన కాలువలపై కట్టడాలు నిర్మించడంతో పాటు చెత్త పేరుకుపోయింది. వీటిని తొలగించాలని రైతులు అనేక సార్లు ఆందోళనలు చేశారు. అయినా అధికారులు స్పందించడం లేదని రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

**నష్టపోతున్న రైతులు**

చెరువు నుంచి శివారు పొలాలకు నీరందక రైతులు నష్టపోతున్నారు. ముఖ్యంగా సిరిపురం గ్రామానికి సాగునీరు అందడం లేదని అన్నదాతలు పోతున్నారు. సిరిపురంలో సుమారు వెయ్యి ఎకరాలను సాగునీరు అందడం లేదు. సమస్యను పలుమార్లు రైతులు అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు.

**తూతూమంత్రంగా పూడిక పనులు**

ప్రధాన కాలువ పూడిక పనులు తూతూమంత్రంగా చేశారని విమర్శలు వస్తున్నాయి. కాలువలో తీసిన పూడికను నెలల తరబడి అక్కడే వదిలివేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. గతంలో ఏలేశ్వరంలోని ప్రధాన కాలువలో పూడిక తీసి వదిలివేయడంతో అదే కాలువలో పడిపోయిందని అప్పట్లో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. కాలువపై ఉన్న ఆక్రమణలు తొలగించి పూర్తిస్థాయిలో పూడిక తొలగింపు పనులు నిర్వహించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

**ఆక్రమణలు తొలగించాలి**




పంట కాలువలపై ఉన్న ఆక్రమణలు తొలగించాలి. ఆక్రమణలతో దిగువ పొలాలకు సాగునీరు రావడం లేదు. కాలువల్లో పూడికతీత పనులు పూర్తిస్థాయిలో చేపట్టాలి.

–సతివాడ వెంకన్న, రైతు, ఏలేశ్వరం

**చర్యలు తీసుకుంటాం**

పంట కాలువల ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటాం. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా పంట కాలువల ఆక్రమణలు చేపడితే వాటిని తొలగిస్తాం. రైతుల పొలలకు నీరు అందించేందుకు కృషి చేస్తాం.

–సాయిచంద్, ఇరిగేషన్ జేఈ, ఏలేశ్వరం



ఆరు వేల ఎకరాలకు సాగునీరు అందించే తిమ్మరాజుచెరువు



ఆక్రమణలకు గురైన ప్రధాన కాలువ

### నేడు సామాజిక తనిఖీ ప్రజా వేదిక

**కిర్లంపూడి:** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో జరిగిన పనులపై మంగళవారం సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించనున్నట్టు ఏపీఓ ఏవీబీ నాయుడు సోమవారం తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు ప్రజావేదిక ప్రారంభమవుతుందన్నారు. 2023–2024 ఆర్థిక సంవత్సరంలో జరిగిన పనులపై తనిఖీలు నిర్వహిస్తారని చెప్పారు. ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు హాజరుకావాలని కోరారు.

### బాధిత కుటుంబానికి చేయూత

**శంఖవరం:** మండలంలోని అచ్చంపేటలో అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి కత్తిపూడికి చెందిన సాయిప్రియ స్వచ్ఛంద సంస్థ చేయూతను అందించింది. బాధితుడు చింతపల్లి అప్పలకొండ కుటుంబాన్ని సాయిప్రియ సంస్థ అధ్యక్షులు జ్యోతుల శ్రీనువాసరావు పరామర్శించి ఓదార్చారు. బాధితులకు బియ్యం, నిత్యావసర సరకులు, నగదు అందించారు. ప్రభుత్వంపరంగా ఆదుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో మేకల కృష్ణ, బొట్టా అప్పలరాజు, కురందాసు తాతాజీ, మామిడి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

### రేట్లు తగ్గించాలని వినతి

**జగ్గంపేట:** గ్రామంలో వ్యాపారులు దీపావళి సామగ్రి అధిక ధరలకు విక్రయిస్తూ ప్రజలను దోచుకుంటున్నారని పలు ప్రజా సంఘాల నేతలు ఆరోపించారు. దీపావళి సమగ్రి రేట్లు తగ్గించాలని కోరుతూ సోమవారం జగ్గంపేట తహసీల్దార్ రమేష్, ఎస్సై రఘునాథరావు, ఫైర్ ఆఫీసర్ లక్ష్మణరావులకు వినతి పత్రాలు సమర్పించారు. దీపావళి సామగ్రి అమ్మే దుకాణాల్లో పిల్లలు లేకుండా చూడాలని కోరారు.

# సబ్ జైలులో తనిఖీలు



ప్రత్తిపాడు సబ్ జైలును పరిశీలిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి ప్రకాష్‌బాబు

**ప్రత్తిపాడు:** స్థానిక సబ్ జైలును రాజమహేంద్రవరం కోర్టు సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ప్రకాష్‌బాబు సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సబ్ జైలులోని పలు రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. ఖైదీలను పరామర్శించి, వారి ఆరోగ్య స్థితిగతులపై ఆరా తీశారు. వారికి అందుతున్న వసతులను అడిగి తెలుసుకున్నారు. ముద్దాయిలు ఉన్న గదులు, భోజన వసతిని క్షుణంగా పరిశీలించారు. ఖైదీలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఆయన వెంట సబ్ జైలు సూపరింటెండెంట్ ఎస్‌కే బాబు, ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ రాష్ట్ర నాయకుడు బుగత శివ, బార్ అసోసియేషన్ కార్యదర్శి బొంగుకూరి మధుబాబు, అడ్వకేట్ మల్లేశ్వరరావు, పారా లీగల్ వలంటీర్లు గంగాధర్, సాంభశివ, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# మిడ్డే మీల్స్ వర్కర్ల ధర్నా



ఎంఈఓకు వినతి పత్రం అందజేస్తున్న మిడ్డే మీల్స్ వర్కర్లు

**గండేపల్లి:** ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న మిడ్డే మీల్స్ వర్కర్లను అక్రమంగా విధుల నుంచి తొలగించారంటూ సోమవారం స్థానిక ఎంఈఓ కార్యాలయం వద్ద ఆ వర్కర్ల సంఘం నాయకులు, వర్కర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని సింగరం పాలెం స్కూల్‌లో పని చేస్తున్న నొక్కు సూకరత్నం, రాండి నాగమణిలను ఎటువంటి కారణం లేకుండా విధుల నుంచి తొలగించారన్నారు. వీరితో పాటు మండలంలోని మరో పది మందిని విధుల నుంచి తొలగించినట్టు తెలిపారు. తొలగించిన వర్కర్లను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని ఎంఈఓకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎస్.ఈశ్వరి, మిడ్డే మీల్స్ యూనియన్ మండల అధ్యక్షురాలు ఊబ గంగ, సెక్రటరీ గంగులూరి మరియమ్మ, సభ్యులు సూకరత్నం, నాగమణి, ఏసమ్మ, వీరమణి, వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

### రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన భూపతిపాలెం విద్యార్థులు

**గోకవరం:** మండలంలోని భూపతిపాలెం గురుకుల పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్టు స్కూల్ ప్రిన్సిపాల్ బి.రవి తెలిపారు. స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా జి.వేమవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగిన జిల్లాస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు అండర్–14 విభాగంలో బి.రిషికేశ్, యన్.సాత్విక్, అండర్–17లో జి.సూర్య, ఎస్.షణ్ముఖ శ్రీనివాస్ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని వివరించారు. ఎంపికైన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

### ర్యాలీని విజయవంతం చేయాలి

**ఏలేశ్వరం:** దేశంలో మత రాజకీయాలను వ్యతిరేకంగా డిసెంబర్ 4న విజయవాడలో నిర్వహించే ప్రజాహక్కుల ర్యాలీని విజయవంతం చేయాలని సీపీఐ(ఎంఎల్)లిబరేషన్ నేతలు కోరారు. ఈ మేరకు సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి ఏగుపాటి అర్జునరావు ఆధ్వర్యంలో భద్రవరంలో ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా అర్జునరావు మాట్లాడుతూ విజయవాడలో నిర్వహించే ప్రజాహక్కుల ర్యాలీకి ప్రజలందరూ మద్దతు ప్రకటించాలన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్‌తో అమలు చేస్తామని చెప్పి ఒక్క పింఛన్లకే పరిమితమైందని విమర్శించారు.

### కిర్లంపూడిలో భారీ వర్షం

**కిర్లంపూడి:** మండలవ్యాప్తంగా సోమవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ ఎండ తీవ్రత అధికంగా ఉంది. సాయంత్రం ఒక్కసారిగా ఆకాశంలో మేఘావృతమై భారీ వర్షం పడింది. లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. వాహనచోదకులు రాకపోకలు ఇబ్బందులు పడ్డారు.

### సారాతో వ్యక్తి అరెస్టు

**తుని రూరల్:** మండలంలోని రేఖవానిపాలెం శివారు మరువాడలో పది లీటర్ల సారాతో ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్టు రూరల్ ఎస్సై బి.కృష్ణామాచారి సోమవారం తెలిపారు. మరువాడలో వాహనాలు తనిఖీలు చేస్తుండగా రౌతులపూడి మండలం లచ్చిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన కొంకిపూడి వీరబాబు మోటార్ సైకిల్‌పై బ్యాగ్‌తో వస్తుండగా తనిఖీ చేశామన్నారు. బ్యాగ్‌లో ప్లాస్టిక్ కవరుతో ఉన్న సారాను గుర్తించామన్నారు. వీరబాబును అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్సై వివరించారు.

### భూ తగాదా కేసులో ముగ్గురి అరెస్టు

**ప్రత్తిపాడు:** మండలంలోని వెంకటనగరం పంచాయతీ తోటపల్లి గిరిజన గ్రామంలో భూతగాదా కేసులో ప్రత్తిపాడు పోలీసులు సోమవారం ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. ప్రత్తిపాడు ఎస్సై ఎస్.లక్ష్మీకాంతం కథనం మేరకు తోటపల్లి గ్రామానికి చెందిన కోరాపు చిట్టియ్య, తుల్లి సతీష్ 34 సెంట్ల భూమి కోసం తగాదా పడుతున్నారు. ఈ గొడవ నేపథ్యంలో ఈ నెల 26న కోరాపు చిట్టియ్యపై కత్తితో దాడి చేసి గాయపరిచారు. ఈ కేసులో తుల్లి సతీష్, గొరగపూడి మణికంఠ, తుల్లి శివలను పోలీసులు అరెస్టు చేశారు. నిందితులను ప్రత్తిపాడు కోర్టులో హాజరుపరచగా ఇన్‌చార్జి న్యాయమూర్తి నిందితులకు 14 రోజుల రిమాండ్ విధించినట్టు స్థానిక ఎస్సై లక్ష్మీకాంతం తెలిపారు.

### అవినీతి రహిత సమాజం కోసం కృషి చేద్దాం

**గండేపల్లి:** అవినీతి రహిత సమాజం కోసం కృషి చేద్దామని పవర్‌గ్రిడ్ డీజీఎం పవన్ కుమార్ పిలుపునిచ్చారు. మండలంలోని సూరంపాలెంలో ప్రజలకు పవర్‌గ్రిడ్ ఆధ్వర్యంలో సోమవారం అవినీతి రహిత సమాజంపై అవగాహన కల్పించారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో మేనేజర్ జె.కోటేశ్వరరావు, జేఈ ఏఎస్ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# అధికారుల తీరుపై గరంగరం

- కౌన్సిలర్లకు సమాచారం లేకుండా అజెండాలో అంశాలు
- ఆగ్రహం వ్యక్తం చేసిన కౌన్సిల్ సభ్యులు



సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ సుధారాణి

**తుని:** ప్రజల చేత ఎన్నిక కాబడిన ప్రజా ప్రతినిధులకు సమాచారం లేకుండా అజెండాలో అంశాలు పొందుపరచడంపై కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చే బాధ్యత తమపై ఉందని, అధికారులు నచ్చిన రీతిలో వ్యవహరిస్తే సహించేది లేదని ధ్వజమెత్తారు. స్థానిక పురపాలక సంఘం కార్యాలయంలో సోమవారం చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. సాధారణ, అత్యవసర సమావేశాలకు సంబంధించి 46 అంశాలను అజెండాలో పొందు పరచగా నాలుగు అంశాలను తిరస్కరించారు. మిగతా అంశాలను ఆమోదించారు.

**జీరో అవర్‌లో ప్రశ్నల వర్షం**

పట్టణంలోని సమస్యలపై జీరో అవర్‌లో సభ్యులు ప్రశ్నల వర్షం కురిపించారు. అజెండాలో ప్రవేశపెట్టిన అంశాల్లో కొన్ని ఆయా వార్డులకు చెందిన కౌన్సిలర్లకు సమాచారం లేదని పలువురు అసంతృప్తి వ్యక్తం చేశారు. దీనిపై చైర్‌పర్సన్ సుధారాణి ఎందుకు ఇలా చేశారని కమిషనర్ వెంకట్రావును ప్రశ్నించారు. ప్రజా సమస్యలను మాత్రమే అజెండాలో పొందుపరిచామని ఆయన సమాధానం ఇచ్చారు. భవిష్యత్‌లో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని అధికారులను చైర్‌పర్సన్ ఆదేశించారు. గత కౌన్సిల్ సమావేశంలో వాయిదా పడిన 27 అంశాలకు సభ్యులు ఆమోదం తెలిపారు. వీరవరపుపేటలో అక్రమ కట్టడం పేరుతో ఇల్లు కూల్చివేసిన విషయంపై కౌన్సిల్‌కు ఎందుకు సమాచారం ఇవ్వలేదని చైర్‌పర్సన్ సుధారాణి ప్రశ్నించారు. హైకోర్టు ఆదేశాలను అమలు చేశామని, ఇందులో ఎటువంటి ఉల్లంఘనలకు పాల్పడలేదని కమిషనర్ వెంకట్రావు సమాధానం ఇచ్చారు. ప్రజల సమస్యలను కౌన్సిలర్ల దృష్టికి తీసుకురావాలని ఆయా శాఖలకు చెందిన అధికారులను ఆదేశించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ రుపాదేవి, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# నిందితుడిని అరెస్టు చేయాలంటూ ఆందోళన



ప్రత్తిపాడులో తహసీల్దార్ సూర్యప్రభకు వినతి పత్రం అందిస్తున్న లిబరేషన్ నాయకులు

**ప్రత్తిపాడు:** వివాహితను లైంగిక వేధింపులకు గురి చేస్తున్న వ్యక్తిని తక్షణమే అరెస్టు చేయాలని కోరుతూ సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ ఆధ్వర్యంలో సోమవారం ప్రత్తిపాడులో ఆందోళన నిర్వహించారు. స్థానిక లిబరేషన్ కార్యాలయం నుంచి మార్కెట్, అల్లూరి జంక్షన్, మెయిన్‌రోడ్డు మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా లిబరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు మానుకొండ లచ్చబాబు మాట్లాడుతూ ప్రత్తిపాడు మండలం చింతలూరు గ్రామానికి చెందిన రాజేశ్వరికి, మండలంలోని ఒమ్మంగి గ్రామానికి చెందిన పెద్దాడ సూరిబాబుతో ఆరేళ్ల క్రితం వివాహం కాగా వారికి ఇద్దరు సంతానం ఉన్నారన్నారు. రాజేశ్వరిని చింతలూరు గ్రామానికి చెందిన మాసా అర్జున్‌కుమార్ లైంగికంగా వేధిస్తున్నాడని, అతనిపై కఠిన చర్యలు తీసుకోవాలని లచ్చబాబు డిమాండ్ చేశారు. ధర్నా నంతరం తహసీల్దార్ ఎం.సూర్యప్రభకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో విప్లవ యువజన సంఘం అధ్యక్షుడు తాడి లక్ష్మణరావు, లిబరేషన్ అనుబంధ సంస్థల నాయకులు దుమ్ముల సింహాచలం, భాస్కరరావు, కడింపల్లి నాగు, కాదా నాగేశ్వరరావు, ముప్పిడి వీరమణి, ఎండగొండ వరలక్ష్మి, కాదా కాంతం, ముప్పిడి విజయ తదితరులు పాల్గొన్నారు.

### ఆస్తుల కోసమే జగన్ కుటుంబంలో కలహాలు



మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు

**తుని రూరల్:** మాజీ సీఎం జగన్ తల్లి, చెల్లెకు వాటాల పంపిణీతో కుటుంబంలో ఆస్తి తగాదాలు వచ్చాయని మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు అన్నారు. తుని మండలం తేటగుంటలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ విషయంలో విజయసాయిరెడ్డి శకుని పాత్ర పోషిస్తున్నాడని ఆరోపించారు. జగన్ పాలనలో ఆర్థిక వ్యవస్థలు బాగుంటే ప్రజలు ఎందుకు తిరస్కరించారన్నారు. కూటమి ప్రభుత్వం విజన్‌తో అభివృద్ధి, సంక్షేమంపై దృష్టి పెట్టి ముందుకు సాగుతుందని తెలిపారు. చంద్రబాబు పాలనలో రాష్ట్రం బాగుపడడం చూడలేక జగన్ ఏమి జరగడంలేదని ఆరోపిస్తున్నారన్నారు. రాష్ట్రానికి అభివృద్ధి, సంక్షేమం, పరిశ్రమలు అవసరమని వివరించారు. తమ పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తుందన్న నమ్మకం వైఎస్సార్ సీపీ నాయకులకు, కార్యకర్తలకు లేదని, దాంతో ఇతర పార్టీల వైపు చూస్తున్నారన్నారు. వైఎస్సార్ సీపీ మొత్తం ఖాళీ అయిపోతుందని జోస్యం చెప్పారు.

### సిరిపురంలో క్షేత్ర దినోత్సవం

**ఏలేశ్వరం:** పొలం పిలుస్తోంది సూచనలు పాటిస్తే రైతులు తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి బి.జ్యోతి అన్నారు. మండలంలోని సిరిపురంలో సోమవారం క్షేత్ర దినోత్సవం నిర్వహించారు. దీనిలో భాగంగా పంటకోత ప్రయోగం నిర్వహించి దిగుబడి వివరాలను రైతులకు వివరించారు. అనంతరం ఉత్తమ రైతులను ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి సన్మానించారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# రక్తదానం చేసి ప్రాణదాతలు కండి



తుని ఆసుపత్రిలో రక్తదానం చేస్తున్న పోలీసులు

**తుని:** యువత ఆపద సమయంలో క్షతగాత్రులను కాపాడేందుకు రక్తం చేసి ప్రాణదాతలు కావాలని తుని పట్టణ సీఐ గీతా రామకృష్ణ సూచించారు. పోలీసు అమరవీరుల వారోత్సవాలను పురస్కరించుకొని సోమవారం తుని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్‌బాబు, టీడీపీ నేత యనమల రాజేష్ ప్రారంభించారు. ఈ శిబిరంలో 60 యూనిట్ల రక్తాన్ని పోలీసులు, విద్యార్థులు దానం చేశారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాల సందర్భంగా ఈ నెల 30 వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తుని రూరల్ సీఐ చెన్నకేశవరావు తెలిపారు. రక్తదానం చేసిన పోలీసులను అభినందించారు. ఆసుపత్రి సూపరింటిండెంట్ స్వప్న, అభివృద్ధి కమిటీ సభ్యులు తటవర్తి రాజా, జి.చిన్నారావు, డాక్టర్లు విజయ్, ఎన్‌వీ సుబ్బారావు పాల్గొన్నారు.

**విద్యార్థులకు సర్టిఫికెట్ల అందజేత**

**గండేపల్లి:** మండలంలోని సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ, ప్రగతి ఇంజినీరింగ్ కళాశాలల్లో రక్తదానం చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేసినట్టు సీఐ వైఆర్కే శ్రీనివాస్ తెలిపారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఆయా కళాశాలల్లో రక్తదాన శిబిరాలు నిర్వహించారు. రక్తదానం శిబిరంలో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేసినట్టు చెప్పారు.

### కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

**తుని:** పురపాలక సంఘంలో పని చేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో ధర్నా నిర్వహించారు. సీఐటీయూ నాయకులు, మున్సిపల్ కార్మికులు ర్యాలీగా మున్సిపల్ కార్యాలయానికి చేరుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ తుని శాఖ కార్యదర్శి ఎస్.శ్రీనివాస్ మాట్లాడుతూ కాంట్రాక్టు పద్ధతిలో పని చేస్తోన్న ఇంజినీరింగ్ కార్మికులకు జీతాల పెంపుతో పాటు టీఏ, డీఏలు చెల్లించాలని డిమాండ్ చేశారు. రెగ్యులర్ కార్మికుల బకాయిలను చెల్లించాలని, పని భారం తగ్గించి, ఈపీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని కోరారు. సీఐటీయూ నాయకులు అప్పారావు, సూకరాజు, శాంతి కుమారి, కిశోర్, కొండబాబు, రవి పాల్గొన్నారు.

### డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో నిందితులకు జైలు

**గండేపల్లి:** డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన నిందితులకు కోర్టు జైలు శిక్ష, జరిమానా విధించినట్టు స్థానిక సీఐ వైఆర్కే శ్రీనివాస్ తెలిపారు. వివరాల్లోకి వెళితే.. స్థానిక పోలీసులు హైవేపై సోమవారం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిపై కేసు నమోదు చేసి పెద్దాపురం కోర్టులో హాజరు పరచగా మేజిస్ట్రేట్ జి.కృష్ణ శేషాచార్య ఆరుగురు వ్యక్తులకు ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున జరిమానా, మరో ఇద్దరికి రెండు రోజుల పాటు జైలు శిక్ష విధించినట్టు తెలిపారు. అలాగే గండేపల్లిలో ఆరు బయట మద్యం తాగుతున్న 9 మందిని, జగ్గంపేటలో ఒక్కరిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వారిని పెద్దాపురం కోర్టుకు తరలించగా ఒక్కొక్కరికి రూ.500 చొప్పున జరిమానా విధించినట్టు వివరించారు.